క్లుప్తంగా

ఫోర్త్ టౌన్ పీఎస్‌ను సందర్శించిన సీపీ



స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

తాటిచెట్లపాలెం: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి గురువారం ఉదయం ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ ఉమాకాంత్‌తో కలిసి స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. స్టేషన్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని, అస్తవ్యస్తంగా ఉన్న వాహనాలను పరిశీలించి ఎప్పటికప్పుడు నిబంధనలకు అనుగుణంగా యజమానులకు అందజేయాలని సూచించారు. సీపీతోపాటు ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి ఉన్నారు.

బాడీబిల్డింగ్ పోటీల విజేతకు అభినందనలు



ప్రవీణ్‌కుమార్‌ను అభినందిస్తున్న కాలనీవాసులు

మద్రిపాలెం: ఐసీఎస్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ బాడీబిల్డింగ్ పోటీల్లో 53వ వార్డు జాకీర్ హుస్సేన్‌నగర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ సత్తా చాటాడు. ఫిట్‌నెస్ కేటగిరీలో 18 ఏళ్లే విభాగంలో మూడు స్వర్ణ పతకాలు, ఒక కాంస్య పతకం సాధించాడు. నగరానికి చేరుకున్న ప్రవీణ్‌కుమార్‌కు కాలనీవాసులు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు. కేక్ కట్‌చేసి పరిసర ప్రాంతాల్లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం సురేష్‌రామ్‌నగర్ కొండవాలులో అభివృద్ధి పనులకు గురువారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు శంకుస్థాపన చేశారు. జోన్–5 ఇంజినీరింగ్ అధికారుల నేతృత్వంలో సుమారు రూ.1.24 కోట్లతో సీసీ రోడ్లు, సీసీ కాలువలు, మెట్ల మార్గాలు, వరద నీటి కాలువలు, రక్షణ గోడలు తదితర పనులకు భూమిపూజ జరిపారు. అనంతరం శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాము, ఇంజినీరింగ్ ఈఈ పద్మావతి, కార్పొరేటర్ కామేశ్వరి, వార్డు అధ్యక్షుడు గుణుపూడి అరుణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



చిన్ని మణికంఠ

తాటిచెట్లపాలెం: ఓ యువకుడి అదృశ్యంపై ద్వారకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సీతమ్మధార పీ అండ్ టీ కాలనీకి చెందిన రమణ కుమారుడు చిన్ని మణికంఠ ఈ నెల 8 నుంచి కనిపించడం లేదు. యువకుడి ఎత్తు 5.9 అడుగులు, చామనచాయ, నల్లరంగు ప్యాంట్ వేసుకున్నాడు. కుడి చెయ్యి, కుడి కాలు సరిగా పనిచేయవు. ఈమేరకు యువకుడి బంధువులు ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. మణికంఠ ఆచూకీ తెలిసిన వారు ద్వారకా పోలీసులకు స్వయంగా గానీ లేదా 94409 04332, 70751 82987 నంబర్లలో తెలియజేయాలని కోరారు.

కుటుంబ సభ్యుల చెంతకు బాలిక



నక్షత్రను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్‌ఐ సతీష్, కానిస్టేబుల్ నారాయణ

అల్లిపురం: తప్పిపోయిన బాలికను టూ టౌన్ పోలీసులు సకాలంలో వెతికి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కొబ్బరితోట ప్రాంతానికి చెందిన నీలం నక్షత్ర (4) బుధవారం సాయంత్రం నుండి కనిపించకుండా పోయింది. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్.ఐ. సతీష్, కానిస్టేబుల్ నారాయణ విచారణ చేపట్టారు. బాలికను వెతికి పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మలుపుల్లో ముప్పు



104 ఏరియా - ఇండస్ట్రియల్ ఎస్టేట్ రహదారి మలుపులో వర్షపు నీటితో నిండిన డ్రైనేజీ



అదే మలుపు వద్ద రక్షణ పలకలు లేని డ్రైనేజీ

- కంచరపాలెం–మద్రిపాలెం రహదారుల మలుపుల వద్ద నోళ్లు తెరిచిన డ్రైనేజీలు
- వానొస్తే నిండిపోయి కనిపించని వైనం
- ప్రమాదాల బారిన పాదచారులు, వాహన చోదకులు

కంచరపాలెం: జీవీఎంసీ 54, 55 వార్డుల పరిధిలోని పలు రహదారుల మలుపుల్లో ముప్పు పొంచి ఉంది. కంచరపాలెం నుంచి మద్రిపాలేనికి వెళ్లే బీఆర్‌టీఎస్ రహదారి ప్రధాన మలుపు వద్ద డ్రైనేజీలు ప్రమాదభరితంగా మారాయి. 104 ఏరియా నుంచి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు వెళ్లే మార్గం, ఐటీఐ కూడలి నుంచి కంచరపాలెం పోలీస్ స్టేషన్‌కు వెళ్లే మార్గం, ఊర్వశి కూడలి నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గం, కంచరపాలెం నుంచి తాటిచెట్లపాలెం ధర్మానగర్‌కు వెళ్లే మార్గాల్లోని మలుపుల వద్ద డ్రైనేజీలను అసంపూర్తిగా వదిలేయడం, మరికొన్ని చోట్ల రహదారులపైకి డ్రైనేజీ సిమెంటు దిమ్మెలు వేయడంతో అటుగా రాకపోకలు సాగించే పాదచారులు, వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.



ఐటీఐ కూడలి - కంచరపాలెం పోలీస్ స్టేషన్ రహదారిలో ప్రమాదకర మలుపు

పట్టించుకునే వారేరి..?

మద్రిపాలెం నుంచి 104 ఏరియా మీదుగా ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు వెళ్లే మలుపు అత్యంత ప్రమాదకరంగా కనిపిస్తోంది. ఇక్కడి మలుపులోని కాలువలపై సిమెంటు దిమ్మెలు లేకపోవడంతో వర్షాలు కురిసేటప్పుడు అవి నీటితో నిండిపోతున్నాయి. రాకపోకల సమయంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు, వాహన చోదకులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. 54వ వార్డు సిద్ధార్థనగర్‌లో గత నెలలో కురిసిన వర్షాలకు ఓ వ్యక్తి కాలు జారి కాలువలో పడి మురుగు నీటిలో మునిగి మృతి చెందిన సంఘటనలో హడావుడి చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు.. నేడు ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదని పలువురు స్థానికులు విమర్శిస్తున్నారు.

వర్షాలు కురిస్తే మరింత ప్రమాదకరం..

వర్షాలు కురిసేటప్పుడు రహదారుల మలుపుల వద్ద గల డ్రైనేజీలు నీటితో నిండిపోతూ రోడ్డుకు సమాంతరంగా కనిపిస్తున్నాయి. వర్షపు నీరే కదా అని అటుగా ప్రయాణిస్తే గోతులో పడాల్సిందేనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కురుస్తున్న వర్షాలకు రహదారి మలుపులు మరింత ప్రమాదకరంగా మారాయి. నిత్యం రాకపోకలు సాగించే ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు మలుపుల వద్ద డ్రైనేజీలను గుర్తించి జాగ్రత్తగా ప్రయాణిస్తున్నారు. కొత్తగా రాకపోకలు సాగించే వారి పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ప్రమాదకర మలుపులపై ఆయా వార్డుల కార్పొరేటర్లకు, జోన్–5 అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జోనల్ కమిషనర్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వర్షాలు కురిసే సమయంలో రోడ్డు మలుపు వద్ద పొంగి ప్రవహిస్తున్న కాలువ

అధికారులు స్పందించాలి



మద్రిపాలెం - కంచరపాలెం రహదారుల్లోని ప్రమాదకర మలుపుల వద్ద డ్రైనేజీలు గోతులమయంగా మారాయి. వర్షాలు కురిసేటప్పుడు అవి నీటితో నిండి కనిపించడం లేదు. అటుగా రాకపోకలు సాగించే పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల ఓ పాదచారుడు డ్రైనేజీ వద్ద జారి పడ్డాడు. స్థానికులు స్పందించడంతో ప్రమాదం తప్పింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– జి.అరుణ్‌కుమార్, బర్మా కాలనీ

లోక హితార్థం లక్ష్మీగణపతి హోమం

తాటిచెట్లపాలెం: లోక హితార్థం హోమాలు, క్రతువులు చేయడం వల్ల దేశం సుభిక్షంగా ఉంటుందని జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. వినాయక చవితి సందర్భంగా తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇ.కె. సంస్కృతి సదన్ ప్రాంగణంలో ఘనంగా శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక హితం కోసం వరల్డ్ టీచర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాస్టర్ ఇ.కె. అనేక ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహించారని, దీనిలో భాగంగా సంప్రదాయ పూజలు, రుద్రాభిషేకం, అగ్ని హోత్రాది క్రతువులు ఏర్పాటు చేశారని తెలిపారు. క్రతువులో సంస్థ కార్యదర్శి బి.ఆర్.కె.రాజు, ప్రాంతీయ గణపతులు బి.శ్రీనివాసరావు(విజయనగరం), ఎంఎస్ఆర్ స్వామి(లాసన్స్ బే కాలనీ), బాలభాను విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్.శుభశ్రీ, గూటాల రమణ(న్యూయార్క్), మాస్టర్ హోమియో వైద్యాలయం సేవకుడు ఎస్.వి.సత్యనారాయణ, జనకులం ఫౌండేషన్ ధర్మకర్త సిహెచ్.శ్రీనివాసరాజు, ట్రస్ట్ డైరెక్టర్ బి.ఉషారాణి, దాట్ల రాధ, గొల్లపూడి రవికుమార్, ఎ.శైలజ పాల్గొన్నారు.



పూర్ణాహుతి సమర్పిస్తున్న సత్యదేవ్ దంపతులు

అభివృద్ధిలో ఎన్జీవోల పాత్ర కీలకం

సీతంపేట: అభివృద్ధి కార్యక్రమాల్లో ఎన్జీవోల పాత్ర కీలకమని ఎస్ఆర్‌యూ జీవీఎంసీ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస రాజమణి అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం జరిగిన ఎన్జీవో ఫోరం సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. జీవీఎంసీ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలన్నీ భాగస్వాములు కావాలని కోరారు. తమ సస్టైనబుల్ రెలిజియన్స్ యూనిట్ అందిస్తున్న సేవలను వివరించారు. రిసోర్స్ పర్సన్ సుశాంత్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులు ఏవిధంగా సేకరించవచ్చు తెలియజేశారు. కాలేశ్వరరావు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ఏయే పుస్తకాలు నిర్వహించాలి, అకౌంట్స్ నిర్వహణ, ఆడిటింగ్ నిర్వహించడం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. బాలల హక్కులపై పనిచేస్తున్న చిట్టిబాబు మాట్లాడుతూ బాలలతో పనిచేస్తున్న సంస్థలు ఏయే రిజిస్ట్రేషన్లు చేయించాలి, అవసరమైన పుస్తకాల నిర్వహణ, ఏయే ప్రభుత్వ శాఖలను సంప్రదించాలో వివరించారు. కార్యక్రమంలో వైజాగ్ ఎన్జీవో ఫోరం అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజు, కార్యదర్శి జె.వి.రత్నం, కోశాధికారి అబ్దుల్ మునీర్, సభ్యులు భాస్కరరావు, డాక్టర్ శశిప్రభ, ప్రకాశరావు, ప్రజ్ఞాన్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎన్జీవో సంస్థల ప్రతినిధులు

రచయితకు గ్రహణశక్తి అవసరం

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రిజం కళాశాలలో గురువారం నిర్వహించిన కథా కచేరి ఆకట్టుకుంది. పలువురు రచయితలు చదివి వినిపించిన స్వీయ కథానికలు వైవిధ్యభరితంగా అలరించాయి. రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ కథా రచయితకు మంచి గ్రహణశక్తి ఉండాలని, కథలో విశ్వజనీన ఉండాలన్నారు. కథ పేరు చెబితే రచయిత గుర్తుకు రావాలని, ఆవిధంగా ప్రతి రచయిత గుర్తుండిపోయేలా కథలు రాయాలని సూచించారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కథలు జీవిత వాస్తవాలకు ప్రతిబింబాలన్నారు. కథలో శిల్పం చక్కగా ఉండి ఉదాత్తత కలిగి ఉండాలన్నారు. డాక్టర్ సి.హెచ్.నిర్మలాదేవి మాట్లాడుతూ కథలు సంఘటనల నుంచి కూడా పుడతాయని, కథకు స్పందన అవసరమన్నారు. కార్యక్రమంలో రచయితలు రాంభట్ల నృసింహశర్మ, సిహెచ్.చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణ మూర్తి, సోమంచి వినయ భూషణరావు, కె.వి.ఎస్. మూర్తి, కె.భీమేశ్వరరావు, బి.రాధారాణి, తనికెళ్ల సూర్యకళ, ఆర్.శివాజి స్వీయ కథలు వినిపించారు.




మాట్లాడుతున్న రచయిత సూర్యారావు

విశాఖ ఉక్కుపై అబద్ధపు ప్రచారాలు

డాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యల దూకుడును కేంద్ర బీజేపీ ప్రభుత్వం చేపట్టిందని, ఇప్పటికే 32 విభాగాలను ప్రైవేట్‌కు కట్టబెట్టేందుకు పూనుకుందని, రాష్ట్ర కూటమి ప్రభుత్వం, ముఖ్యంగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ శ్రీభరత్ ప్రైవేటీకరణ చేయడం లేదని, యూనియన్లు, కొంత మంది కార్మికులు పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారంటున్న అబద్ధపు ప్రచారాన్ని ఆపాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కొత్తపల్లి లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యవర్గ సభ్యులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, బి.జగన్, వి.కృష్ణారావుతో కలిసి మాట్లాడారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం లేదని, మోదీతో ఎందుకు ప్రకటన చేయించలేకపోతున్నారని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ కాదని అంటూనే ఈవోఐ పేరిట 32 విభాగాలను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించడానికి చర్యలు తీసుకున్నారా? లేదా? ప్రజలకు తెలపాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామని మోదీ ప్రభుత్వం చెప్పడమే కాక అందుకు అవసరమైన చర్యలన్నీ చేపట్టిందని, ప్లాంట్‌ను రక్షించలేక, కార్మికులు, కార్మిక సంఘాలపైన దుష్ప్రచారానికి పల్లా శ్రీనివాస్ పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు.

బాలలంతా చక్కగా చదువుకోవాలి

విశాఖ–లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు గురువారం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పాపా హోమ్ ఫర్ బాయిస్‌ను సందర్శించి బాలల సంక్షేమం, భద్రత, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. చిన్నారులకు న్యాయపరమైన రక్షణ, విద్య, ఆహార వసతులు ఎలా అందుతున్నాయో పరిశీలించారు. పిల్లలకు న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య ఎదురైతే ఉచిత న్యాయ సేవలు అందించడానికి డీఎల్ఎస్ఏ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. బాలలందరు బాగా చదువుకుని, మంచి అలవాట్లు అలవరుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పిల్లలకు పుస్తకాలు, పెన్నుల కిట్లు అందజేశారు. హోమ్ కోశాధికారి రమేష్ చంద్, జయంత్, రహీమున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

దేవా శ్రీ గణేశా..

- ఘనంగా వినాయక చవితి వేడుకలు
- ఆలయాలు, మండపాలకు పోటెత్తిన భక్తులు



సీతంపేట దుర్గాగణపతి ఆలయం వద్ద భక్తుల రద్దీ

సీతంపేట: నియోజకవర్గంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వరుడి ఆలయాలు, మండపాల్లో స్వామిని భక్తులు కనులారా దర్శించుకుని సంప్రదాయ పద్ధతిలో పూజలు చేశారు. ఇళ్లల్లో చిట్టి వినాయక ప్రతిమలు పెట్టి.. వ్రతం ఆచరించారు. వాడవాడలా వినాయక మండపాల వద్ద సందడి వాతావరణం నెలకొంది.



వాణి గణపతిగా దుర్గాగణపతి

దుర్గాగణపతి నమోస్తుతే..

సీతంపేట కూడలిలోని దుర్గాగణపతి ఆలయంలో నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామివారి దర్శనానికి భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. వినాయక చవితి రోజున దుర్గాగణపతి నిజరూపంలో దర్శనమిచ్చారు. ఆలయ ఈవో జి.వి.రమాభాయి, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు నటరాజన్ ఆధ్వర్యంలో గణపతికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం వద్ద సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉత్సవ సేవా కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది.

వాణి గణపతి అలంకారం

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం వాణి గణపతి అలంకరణలో దుర్గాగణపతి భక్తులకు దర్శన మిచ్చారు. శుక్రవారం లక్ష్మీగణపతి అలంకారంలో స్వామి దర్శనమిస్తారు.



సాక్షి గణపతి ఆలయ పూజల్లో భక్తులు



మధురానగర్‌లో బాలగణపతిగా దర్శనమిచ్చిన విజయ గణపతి

దుర్గాగణపతికి 99 కిలోల భారీ లడ్డూ

సీతంపేట: దుర్గాగణపతికి వినాయక నవరాత్రి మహోత్సవాల సందర్భంగా గురువారం 99 కిలోల భారీ లడ్డూను ప్రసాదంగా నివేదన చేశారు. భారీ లడ్డూను ఆలయ ప్రాంగణంలోని గ్లాస్ బాక్సులో భక్తుల దర్శనార్థం ఉంచారు. నవరాత్రి ఉత్సవాల ఆఖరి రోజున ఈ లడ్డూకు బహిరంగ వేలం వేస్తామని, వచ్చిన డబ్బును మహా అన్నదానానికి ఖర్చు చేస్తామని ఉత్సవ కమిటీ తెలిపింది.



దుర్గాగణపతికి నివేదించిన భారీ లడ్డూ

- శంకరమఠం రోడ్డు మధురానగర్‌లోని విజయ గణపతి ఆలయంలో స్వామి వారు బాలగణపతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర ప్రాంతాల భక్తులు అభిషేకాలు, అర్చనలు చేశారు.
- అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో గణపతి త్రిరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు మణిద్వీపంలో విజయ గణపతికి విశేష పంచామృతాలతో అభిషేకం, వినాయక పూజ, కార్యసిద్ధి నిర్వహించారు. సాయంత్రం మహా గణపతి, భైరవ హోమాలు చేశారు. పీఠం దర్బారు హాల్లో గణపతి విగ్రహాన్ని ప్రతిష్టించి వినాయక వ్రతం ఆచరించారు. గురువారం విజయాలను ప్రసాదించే వారాహి హోమం జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రత్యేక పూజా, సాంస్కృతిక కార్యక్రమాలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు నరసింహనగర్ పార్కులో నరసింహనగర్ యూత్ కల్చరల్ స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరసిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నిర్వాహకులు నాని, రాజా హరీష్ మాట్లాడుతూ నరసింహనగర్‌లో 13వ ఏడాది ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబరు 6 వరకు శివాలయ అర్చకుడు అంబటిపూటి సుధీర్‌శర్మ నేతృత్వంలో కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

- తాటిచెట్లపాలెం శ్రీ సాక్షి మహాగణపతి ఆలయంలో ఉత్సవ విగ్రహాన్ని సుగంధ ద్రవ్యాలు, పళ్లరసాలు, పాలతో అభిషేకించి ప్రతిష్టించి విశేష పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఆళ్ల శివగణేష్, జీరు గోపి, ఆళ్ల గోపి, బోర పరదేశిరెడ్డి, అప్పలరెడ్డి, సాయి, బాల, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.
- సీతమ్మధార రైతుబజార్‌లో ఆరడుగుల మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించారు. పూజల్లో రైతుబజార్ సిబ్బంది కృష్ణమూర్తి, సతీష్, రైతులు పాల్గొన్నారు.

విశేషంగా గణనాథుడి ఉత్సవాలు

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో గణనాథుడికి విశేష పూజలు నిర్వహించారు. అంబేడ్కర్ కాలనీలో జై భీం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, కళింగనగర్‌లో లంబోధర యూత్, పీవీఆర్ ప్లాజా యూత్, శంకర్‌నగర్‌లో యంగ్ టైగర్ బాయ్స్ కమిటీ, సీతన్న గార్డెన్స్‌లో ప్రిన్స్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువైన విఘ్నేశ్వరుడిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు, వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ దర్శించుకున్నారు. వినాయకుడు అందరినీ అనుగ్రహించాలని ఆకాంక్షించారు.

- 53వ వార్డులో సాయినగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, సాయినగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరసిద్ధి వినాయక పంచమరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. శ్రీ కాశీ విశ్వేశ్వరాలయంలో అర్చకుడు అందుకూరి శివాజీ శర్మ, లలితా అమ్మవారి ఆలయ అర్చకుడు వరాహగిరి వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు.



ఎన్‌జీజీవోస్ కాలనీలో 20 అడుగుల వైభవ్ సామ్రాట్ గణపతి

వైభవ్ సామ్రాట్ గణపతే నమః

మురళీనగర్: జీవీఎంసీ 49, 50 వార్డుల్లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని ఎన్‌జీజీవోస్ కాలనీలో సుదర్శన్ వైభవ్ సేవక్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 20 అడుగుల వైభవ్ సామ్రాట్ గణపతి విగ్రహం ఆకట్టుకుంటోంది.

- వర్మా కాంప్లెక్స్ రహదారిలో క్రియేటివ్ యూత్ ఆధ్వర్యంలో 8 అడుగుల పర్యావరణ హిత మట్టి విగ్రహాన్ని కోల్‌కతా కళాకారులతో తయారు చేయించి ప్రతిష్టించి పూజలు చేస్తున్నారు.
- అడ్డ స్తంభాలు యూత్ ఆధ్వర్యంలో అయ్యప్పనగర్ మసీదు రహదారిలో ఐదడుగుల వినాయకుడిని ప్రతిష్టించారు. గురువారం శివుడి ఆకారంలో దీపోత్సవం నిర్వహించారు.
- మురళీనగర్, పట్టాభిరెడ్డితోట, మాధవధార, అయ్యప్పనగర్, బర్మా కాలనీల్లో స్థానికులు వినాయకుడిని ప్రతిష్టించి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



నరసింహనగర్‌లో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు, అసోసియేషన్ సభ్యులు



సీతన్న గార్డెన్స్‌లో వినాయకుడి సన్నిధిలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ



సాయినగర్‌లో గణపతికి పూజలు చేస్తున్న అర్చకుడు శివాజీ శర్మ

ఆకట్టుకుంటున్న త్రివిధ దళాధిపతులు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లో షణ్ముఖ్ యూత్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభించారు. త్రివిధ దళాధిపతులుగా మండపంలో కొలువైన వినాయకుడు, కుమారస్వామి, అయ్యప్పస్వాముల విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. పెహల్గామ్ ఉగ్రదాడిని ఇండియన్ ఆర్మీ సమర్థవంతంగా తిప్పికొట్టిన సందర్భంగా జవాన్లకు అభినందనలు తెలియజేస్తూ యూత్ సభ్యులు విగ్రహాలు ఏర్పాటు చేశారు. గణపతిని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కర్రి రామారెడ్డి గణపతిని దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. కంచరపాలెంలోని పలు ప్రాంతాల్లోని వినాయక మండపాల్లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.



రవీంద్రనగర్‌లో త్రివిధ దళాధిపతుల గణపతి పూజల్లో కర్రి రామారెడ్డి దంపతులు

- జీవీఎంసీ 46వ వార్డు లక్ష్మీనారాయణపురం–1లో నిజం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో గణపతి విగ్రహాన్ని పోర్టు యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు దంపతులు ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు చేశారు. వాసుపల్లి శ్రీనివాస్, వెంకటరమణ, సన్నిబాబు, వరప్రసాద్ పాల్గొన్నారు.